# అమెరికాలో చనిపోతే..

స్వదేశంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కావు. కానీ విదేశాల్లో చనిపోయిన భారతీయులకు అక్కడే దహన సంస్కారాలు చేయాలంటే ఎన్నో నియమ నిబంధనలు పాటించాలి. అదే పార్థివ దేహాన్ని స్వదేశానికి తరలించాలంటే అనేక శవ పరీక్షలు.. మరెన్నో ప్రభుత్వ అనుమతులు అవసరమవుతాయి. చనిపోయినవారు సామాన్యులా? ప్రముఖులా? అనే విషయాన్ని పక్కనపెట్టి, విదేశాల్లోని ప్రభుత్వ అధికారులు అన్ని నియమ నిబంధనలను తప్పకుండా పాటిస్తారు. ముఖ్యంగా విదేశాల్లో అకస్మాత్తుగా ఎవరైనా చనిపోయినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక వారి కుటుంబసభ్యులు అయోమయానికి గురవడం సహజం. ఈ విషాద పరిస్థితుల నుంచి తేరుకొని చనిపోయిన వ్యక్తి అంతిమ సంస్కారాలు అక్కడే జరిపించాలంటే ఈ పద్ధతులు



పాటించాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి అనారోగ్య కారణంగా ఇంటి వద్ద చనిపోయినా.. ఏదైనా ప్రమాదంలో మరణించినా.. హత్య జరిగినా.. ఆత్మహత్య చేసుకున్నా వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలి. ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఆ పార్థివ దేహాన్ని దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి. అవసరమైతే వైద్యులు శవ పంచనామా చేసి మరణానికి గల కారణాలను ధ్రువీకరిస్తూ ఒక శవపంచనామ నివేదిక (అటాప్సి రిపోర్ట్) రూపొందిస్తారు. ఇందులో ఏ రోజు? ఏ సమయానికి? చనిపోయారన్న విషయాలను నిర్ధారిస్తూ మరణ ధ్రువీకరణ పత్రాన్ని (డెత్ సర్టిఫికేట్) జారీ చేస్తారు. ఒకవేళ చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే చనిపోతే.. ఏ కారణాలతో చనిపోయారో వివరిస్తూ వైద్య అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారు. తర్వాత ఆ పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు సూచించిన విధంగా స్థానికంగా ఉన్న ఒక 'ఫ్యునరల్ హోం' (అంతిమ సంస్కారాలు జరిపే ప్రదేశం)కు తరలిస్తారు. అంతిమ సంస్కరాలు అక్కడే జరపాలా? పార్థివ దేహాన్ని విదేశాలకు పంపాలా? అనే విషయాన్ని కుటుంబసభ్యుల నుంచి రాత పూర్వకంగా తీసుకొని అధికారులు తదుపరి చర్యలు చేపడతారు. ఈ సమయంలో ఫ్యునరల్ హోం అధికారులకు కుటుంబ సభ్యులు ఈ వివరాలు అందజేయాలి.

## ఇవ్వాల్సిన వివరాలు

*1. చనిపోయిన వ్యక్తి పేరు; 2. స్త్రీ లేదా పురుషుడు; 3. పుట్టిన తేది; 4. వయస్సు; 5. జన్మస్థలం; 6. సోషల్ సెక్యూరిటీ నంబర్ (ఒకవేళ ఉంటే); 7. జాతి; 8. వివాహితులా? లేదా?; 9. భర్త లేదా భార్య వివరాలు; 10. విద్యార్హతలు; 11. వృత్తి; 12. పనిచేస్తున్న రంగం; 13. చిరునామ; 14. తండ్రి పేరు; 15. తల్లి ఇంటి పేరు (పెళ్లికాక ముందు); 16. చనిపోయిన స్థలం, ప్రాంతం; 17. ఆస్పత్రి పేరు; 18. చనిపోయినట్లుగా తెలిపిన వ్యక్తి పేరు, వివరాలు; 19. అంతిమ సంస్కారాల ప్రాధాన్యత? (దహన సంస్కారమా/ఖననమా/ ఏదైనా ఆస్పత్రికి విరాళమా?)*

ఈ వివరాలను సేకరించిన తర్వాత ఆస్పత్రి నుంచి శవ పంచనామా నివేదిక (ఉంటే), డెత్ సర్టిఫికెట్, చనిపోయిన వ్యక్తి జనన, మరణ నమోదు కార్యాలయం అధికారుల నుంచి చనిపోయినట్లుగా నమోదు చేసిన పత్రాలను ఫ్యునరల్ హోం అధికారులు సేకరిస్తారు. పార్థివ దేహం చెడిపోకుండా భద్రపరిచిన తర్వాత కుటుంబసభ్యుల కోరిక మేరకు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తారు.

## సేకరించాల్సిన పత్రాలు



- చనిపోయిన వ్యక్తి పాస్ పోర్టు.
- పార్థివ దేహం నుంచి ఎటువంటి అంటు వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్టు ధ్రువీకరిస్తూ స్థానిక ఆరోగ్య అధికారుల నుంచి అనుమతి పత్రం.
- పార్థివ దేహాన్ని సీల్డ్ కంటైనర్‌లో భద్రపరచినట్లు ధ్రువీకరించే పత్రం.
- కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారుల నుంచి కావాల్సిన అనుమతి.
- కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారుల నుంచి పార్థివ దేహాన్ని భారత్‌కు పంపడానికి అనుమతి పత్రం.
- పార్థివ దేహాన్ని ఎవరైతే భారత్‌లో స్వీకరిస్తున్నారో వారి వివరాలు.
- పార్థివ దేహాన్ని భారత్‌లో ఏ శ్మశాన వాటికలో దహనం చేస్తున్నారో దాని చిరునామా వివరాలను సేకరించి విమానయాన అధికారులతో ఫ్యునరల్ హోం అధికిరారులు చర్చించి భారత్‌కు తరలిస్తారు.
- సాధారణ పరిస్థితుల్లో ఈ ఏర్పాట్లన్నీ పూర్తై.. పార్థివ దేహం భారత్‌కు చేరడానికి సుమారు 3 నుంచి 5 రోజులు పడుతుంది. దాదాపు 5-8 వేల డాలర్ల ఖర్చవుతుంది.
- పూర్తి వివరాలకు www.prasadthotakura.com వెబ్ సైట్‌ను చూడవచ్చు.

*(డాక్టర్. ప్రసాద్ తోటకూర, ప్రముఖ ప్రవాస భారతీయ నాయకుడు.)*